నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
3 | నిజామాబాద్ శనివారం 21 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL

## కేసీఆర్‌ను కలిసిన మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, సెప్టెంబర్ 20 : తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర మొదటి మంత్రి జాబితాలో పని చేయడం గర్వంగా ఉందని మాజీ మంత్రి జోగు రామన్న సంతోషం వ్యక్తం చేశారు. మాజీ సీఎం కే చంద్రశేఖర్‌రావును మాజీ మంత్రి జోగు రామన్న శుక్రవారం గజ్వేల్ సమీపంలోని ఫామ్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై కేసీఆర్‌తో కలిసి సుదీర్ఘంగా చర్చించారు. నైతికంగా జోగు రామన్నది ఓటమి కాదని రానున్న రోజుల్లో మరిన్ని విజయాలను అందుకుంటామన్నారు. ఎలాంటి ఎన్నికలైనా బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడతారని, తిరిగి ఆదిలాబాద్‌లో జోగు రామన్న విజయం ఖాయం అవుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజా ఉద్యమంలో పాల్గొనాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.


మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన మాజీ మంత్రి జోగు రామన్న

## కడెం ప్రాజెక్టు నుంచి లీకేజీని అరికట్టేందుకు చర్యలు

కడెం, సెప్టెంబర్ 20: కడెం ప్రాజెక్టు వరదగేట్ల నుంచి నీటి లీకేజీ అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రాజెక్టుకు ఇండియాలో తయారు చేసినవి 9 గేట్లు, జర్మనీ దేశానికి చెందిన మరో 9 గేట్లు ఉన్నాయి. ప్రతి ఏడాదీ లీకేజీల రూపంలో పెద్ద మొత్తంలో నీరు వృథాగా పోతుండడంతో యాసంగి పంటలకు నీరు అందని పరిస్థితి నెలకొన్నది. దీంతో అధికారులు లీకేజీలను అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. ఈ పనులను ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరికి చెందిన అరుణ అండర్ వాటర్ మేనేజ్‌మెంట్ సంస్థ చేపట్టింది. సిబ్బంది ఆక్సిజన్ మాస్కులు ధరించి నీటిలో వరదగేట్ల కిందకి వెళ్లి కాటన్‌వేస్ట్‌లతో లీకేజీలను అరికడుతున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు.


ఆక్సిజన్ మాస్కుతో నీటిలోకి వెళ్తున్న సిబ్బంది

# బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

● కలెక్టర్ అభిలాష అభినవ్ ● నిర్మల్, దిలావర్‌పూర్ పాఠశాలలో ప్రారంభం

నిర్మల్ చైన్‌గేట్ /దిలావర్‌పూర్, సెప్టెంబర్ 20 : బాలశక్తి కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. నిర్మల్‌లోని కస్బా మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, దిలావర్‌పూర్‌లోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో బాలశక్తి కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 52 పాఠశాలలో చదువుతున్న 6 నుంచి 12 తరగతుల విద్యార్థులకు ఆరోగ్యం, ఆర్థిక అక్షరాస్యత, క్షేత్రపర్యటన అనుభవాలు, నైపుణ్య అభివృద్ధి సాధికారిత వంటి అంశాలపై అవగాహన కల్పించడం బాలశక్తి కార్యక్రమం లక్ష్యమన్నారు. పాఠశాలల్లో పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామీణ మండల స్థాయి అధికారులు, ఎన్జీవోలు ఆశ కార్యకర్తలు, మహిళా స్వయం సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. రాష్ట్రంలోనే మొదటగా నిర్మల్‌లో బాలశక్తి కార్యక్రమం ప్రారంభించినట్లు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. విద్యార్థులకు బ్యాంకు సేవల నిర్వహణ, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. నైపుణ్యాలు మెరుగుపరుచుకుంటూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా దిలావర్‌పూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఆమె బహుమతులను అందించారు. ఈ కార్యక్రమాల్లో డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో రాజేందర్, ఎంఈవో కస్తూరీ శంకర్, ఎంపీడీవో అరుణారాణి, ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ ఈవో చంద్రశేఖర్, కేజీబీవీ ప్రిన్సిపాల్ అపర్ణ, ఈజీఎస్ ఏపీవో దివ్యారెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్, తహసీల్దార్ స్వాతి, ఎంఈవో శంకర్, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విదార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

# కుల, చేతి వృత్తిదారులకు విశ్వకర్మ యోజన వరం

**ఆదిలాబాద్ ఎంపీ గేడం నగేశ్**

ఉట్నూర్, సెప్టెంబర్ 20 : కులవృత్తిదారులు, చేతి వృత్తిదారులకు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన వరం లాంటిదని ఆదిలాబాద్ ఎంపీ గేడం నగేశ్ అన్నారు. శుక్రవారం స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలో పీఎం విశ్వకర్మ తొలి వార్షికోత్సవంలో కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ గౌస్ ఆలంతో పాటు స్థానిక ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జుతో కలిసి పాల్గొన్నారు. కుల, చేతి వృత్తిదారుల సంక్షేమానికి ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనను గతేడాది ప్రారంభించినట్లు తెలిపారు. 21 మంది వృత్తిదారులకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు పంపిణీ చేశామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు మాట్లాడుతూ 18 రకాల సాంప్రదాయ చేతి వృత్తిదారులకు ఈ పథకం లబ్ధి చేకూరుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఎస్డీ జాయింట్ డైరెక్టర్ విద్యానంద్ హైదరాబాద్, రీజినల్ డైరెక్టర్ వరంగల్ సీతారాములు, ఐటీఐ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.


వృత్తిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

# వినాయక ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాం

● నెల ముందే ప్రణాళికతో సమష్టిగా ముందుకెళ్లాం ● నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 20 : వినాయక నవరాత్రి ఉత్సవాలను జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అందరి సహకారంతో శాంతియుతంగా నిర్వహించామని నిర్మల్ ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో గణేశ్ వినాయక నవరాత్రి ఉత్సవాల బందోబస్తులో పాల్గొన్న పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నెల రోజుల ముందే పోలీసు సిబ్బందికి సూచనలు సలహాలు అందిస్తూ సమావేశాలను నిర్వహించినట్లు తెలిపారు. వినాయక విగ్రహాలు ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు బ్లూ కోల్ట్స్, పెట్రోకార్, ఐటీ, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది కృషి అభినందనీయమని అన్నారు. రాష్ట్రంలో అత్యంత సున్నితమైన ప్రాంతం భైంసాలో నిమజ్జన శోభాయాత్ర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించడంపై ఉన్నతాధికారులు అభినందించడం జిల్లా పోలీసులకు గర్వకారణంగా ఉందన్నారు. దాదాపు 12 రోజులుగా పోలీసు సిబ్బందికి కంటి మీద కునుకు లేకుండా విధులు నిర్వహించారని గుర్తు చేశారు. అలాగే దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను సైతం ఇదే తరహాలో ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలన్నారు. అనంతరం భైంసా ఏఎస్పీ అవినాష్ మాట్లాడుతూ ఎస్పీ మార్గదర్శకాలతో భైంసాలో వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు. అన్ని వర్గాల వారు ఈ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సహకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ గంగారెడ్డి, అధికారులు తదితరులున్నారు.



మాట్లాడుతున్న నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల


బజార్‌హత్నూర్ మండలం పిప్పిరిలో కంకర క్వారీ తవ్వకాలతో ఏర్పడిన గుంతలో నీరు


తాంసి మండలం పుర్రెలగుట్ట వద్ద మొరం తవ్వకాలతో ఏర్పడిన గుంతల్లో నిలిచిన నీరు

# క్వారీ గుంతలు.. మృత్యు ఘంటికలు

● జిల్లాలో ఇష్టానుసారంగా మొరం తవ్వకాలు ● కంకర క్వారీల్లో నిబంధనల ఉల్లంఘన ● ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు


తలమడుగు మండలం కజ్జర్లలో జేసీబీతో మొరం తవ్వకాలు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 20 ( నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో ధనార్జనే లక్ష్యంగా ఎంచుకున్న కొందరు అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కంకర తవ్వకాలు జరుగుతుండగా, ఎలాంటి అనుమతి లేకుండా మొరం తవ్వకాలు జరుపుతున్నారు. తవ్వకాలు జరిపిన చోట్ల ఏర్పడిన గుంతల్లో వాననీరు నిలిచి ప్రజలకు ప్రమాదకరంగా మారుతున్నాయి. జిల్లాలో 7 మాంగనీసు, 16 కంకర, ఒక లైమ్‌స్టోన్ క్వారీలకు మాత్రమే ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి. మొరం క్వారీలకు ఎలాంటి అనుమతులు లేవు. కంకర క్వారీల నిర్వాహకులు భారీగా తవ్వకాలు చేపడుతుండడంతో పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. వర్షాకాలంలో వీటిలో నీరు చేరడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. క్వారీల గుంతలలో పడి పలువురు మృతి చెందిన ఘటనలున్నాయి. కంకర క్వారీల నిర్వాహకులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం ఇష్టానుసారంగా తవ్వకాలు జరపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. నాలుగు రోజుల కిందట బజార్‌హత్నూర్ మండలం పిప్పిరి వద్ద గల కంకర క్వారీ వద్ద ఏర్పడిన గుంతలోని నీటిలో ప్రమాదవశాత్తు పడి సంజన (12) అనే బాలిక మృతి చెందింది. ఇలాంటి గుంతల్లో పడి పశువులు, జంతువులు కూడా మృతి చెందుతున్నాయి.

### అక్రమంగా మొరం తవ్వకాలు

జిల్లాలో మొరం క్వారీలకు ఎలాంటి అనుమతులు లేకున్నా అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వకాలు నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్ రూరల్, మావల, తాంసి, తలమడుగు, గుడిహత్నూర్, ఇతర మండలాల్లో జేసీబీలతో మొరం తవ్వకాలు జరుపుతూ టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇండ్ల నిర్మాణాలు, వెంచర్లు, రహదారులు, వంతెన నిర్మాణాలకు భారీగా మొరం అవసరమవుతుండడంతో అక్రమార్కులకు ఈ దందా వరంగా మారింది. రోజు వందలాది టిప్పర్లలో మొరం తరలుతున్నది. అసైన్డ్ భూములతో పాటు రెవెన్యూ, అటవీ భూముల్లో సైతం మొరం తవ్వకాలు జరుగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. వాహనాలు క్వారీల వరకు పోయేలా రోడ్లను సైతం వేస్తున్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో మొరం తవ్వకాలు జరుగుతున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పలు మండలాల్లో సైతం అక్రమ తవ్వకాలు జరుగుతున్నా చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మొరం తవ్వకాలతో ఏర్పడిన గుంతల్లో పడి ఎప్పుడు ఎవరికి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అక్రమ మొరం తవ్వకాలు, రవాణా విషయంలో మైనింగ్ శాఖ అధికారుల వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులో లేరు.

# గెలిపిస్తే నిరుద్యోగుల గొంతుకనవుతా..

● త్వరలో జరిగే ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తా
● పట్టభద్రులు అండగా నిలిచి గెలిపించండి
● అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

**డబ్బు కోసం కాదు..సేవ చేసేందుకే వస్తున్నా**

నిర్మల్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): సంపాదన కోసం రాజకీయాల్లోకి రావడం లేదని.. సేవ చేయడమే లక్ష్యంగా ఎమ్మెల్సీ బరిలో దిగుతున్నానని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వీ నరేందర్‌రెడ్డి తెలిపారు. తనను గెలిపిస్తే ప్రభుత్వం నుంచి నయాపైసా జీతం తీసుకోకుండా ఉద్యోగులు, నిరుద్యోగుల గొంతుకగా ఉంటానని స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన విద్యనందిస్తూ 34 ఏళ్లుగా విద్యా రంగంలో ఉన్నానన్నారు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా రాష్ట్ర వ్యాప్తంగా 54 విద్యా సంస్థలను ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం 40 వేల మంది విద్యార్థులకు విద్యనందిస్తున్నామన్నారు. చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా మన విద్యార్థులకు ఇక్కడే విలువలతో కూడిన విద్యను అందించి మంచి ఫలితాలను సాధించినట్లు తెలిపారు. తమ విద్యా సంస్థల్లో చదువుకున్న రెండున్నర లక్షల మంది విద్యార్థుల్లో చాలామంది దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారన్నారు. అన్ని విషయాలపై, ముఖ్యంగా విద్యారంగ సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉన్నందున నిరుద్యోగులకు ఏదైనా చేయాలన్న ఉద్దేశంతోనే రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ఎన్నికల్లోపే ప్రైవేట్ విద్యా సంస్థలకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతోపాటు, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు వచ్చేలా ప్రభుత్వంతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు రాజకీయ నాయకులకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన పట్టభద్రులు ఈ సారి విద్యావేత్తనైనా తనను గెలిపించాలని కోరారు. ఇప్పటికైతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలనే ఆలోచనతో ఉన్నట్లు చెప్పారు. ఓటరు ఎన్‌రోల్‌మెంట్‌పై పూర్తి స్థాయిలో అవగాహన లేని కారణంగా గత ఎన్నికల్లో కేవలం లక్షా ఏడు వేల మంది మాత్రమే ఓట్లు వేశారన్నారు. ఈ సారి ఓటరు ఎన్‌రోల్‌మెంట్‌పై అవగాహన కల్పించి పెద్ద ఎత్తున పట్టభద్రులకు ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో ఈ నెల 30 నుంచి ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లాలోని అల్ఫోర్స్ విద్యా సంస్థల ప్రతినిధులు సీహెచ్. వెంకట్‌రెడ్డి, టీ.ప్రమోద్‌రావు, అనీల్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్‌లో మీడియాతో మాట్లాడుతున్న అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వీ.నరేందర్‌రెడ్డి


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి, ఐటీడీఏ పీవో, ఎస్పీ

## నేడు మంత్రి సీతక్క పర్యటన

ఉట్నూర్, సెప్టెంబర్20 : ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క శనివారం జిల్లాలో పర్యటించనున్నట్లు ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉట్నూర్‌లోని కుమ్రంభీం ప్రాంగణంలో మంత్రి ప్రారంభించనున్న ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా కోళ్ల పెంపకం, మానసిక వికలాంగుల వికాసం స్కూల్, నూతనంగా నిర్మించిన బీఈడీ కళాశాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ గౌస్ ఆలం, బీఈడీ ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, నాగభూషణం, తదితర శాఖల అదికారులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తాం

ఎదులాపురం, సెప్టెంబర్ 20: రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజలకు సేవలందిస్తున్న ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని యూనియన్ నాయకులు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ప్ల కార్డులతో నిరసన తెలిపి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ 17 సంవత్సరాలుగా ఆరోగ్య మిత్రలు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలందిస్తున్నారని తెలిపారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆరోగ్య మిత్రలను డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించాలని, జీవో నం.60 ప్రకారం వేతనం రూ.22,750 ఇవ్వాలని, జీత, భత్యాలు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా ట్రస్ట్ ద్వారా చెల్లించాలన్నారు. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డు సౌకర్యాలు కల్పించాలని, సమస్యలు పరిష్కరించ లేదంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, ఆరోగ్య మిత్రా జిల్లా నాయకులు శ్రీనివాస్ విశ్వనాథ్ భీమ్‌రావు అనిత సుజాత గంగామణి తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆరోగ్య మిత్రలతో సిఐటీయూ నాయకులు


మాట్లాడుతున్న ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

## సోయా పంటకు మద్దతు ధర రూ.4892

ఎదులాపురం,సెప్టెంబర్ 20: ప్రభుత్వం సోయా పంటకు మద్దతు ధర రూ.4892 క్వింటాలుకు కొనుగోలుకు జిల్లా కొనుగోలు కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. శుక్రవారం అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అధ్యక్షతన ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 25వ తేదీ నుంచి ప్రాథమిక సహకార సంఘాల ద్వారా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్, జైనథ్, బేల, తాంసి, ఇచ్చోడ, బోథ్, ఇంద్రవెల్లి, హస్నాపూర్, నార్నూర్, నేరడిగొండలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. మద్దతు ధర కంటే తక్కువకు దళారులకు విక్రయించి నష్టపోవద్దన్నారు. సోయా పంటను ఎండలో ఆర బెట్టి తేమ 12 శాతం లోపల ఉండే విధంగా చూడాలని రైతులకు సూచించారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**మున్సిపల్ కార్యాలయం కార్మికుల ధర్నా**

ఎదులాపురం, సెప్టెంబర్ 20 : పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించి వారి ఇబ్బందులను దూరం చేయాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. అధికారుల తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దర్శనాల మల్లేశ్ మాట్లాడుతూ కొన్ని నెలలుగా మున్సిపల్ అధికారులు నిధుల కొరత చూపిస్తూ కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పనికి తగ్గ వేతనం ఇచ్చి ప్రతి కార్మికుడికీ వారాంతపు సెలవులు ఇవ్వాలని కోరారు. కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు తుంగలో తొక్కి శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేటర్లలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న కార్మికులందరినీ రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని, లేదంటే రాబోయే రోజుల్లో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో జిల్లా కార్యదర్శి అగ్గిమల్ల స్వామి, జిల్లా అధ్యక్షుడు నగేశ్, జనార్దన్, ఉషన్న తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు